


ఓ మై ఫ్రెండ్..

స్నేహం ఎంతో మధురమైనది. కష్టకాలంలో నేనున్నానంటూ భుజం తట్టే ఆత్మీయ స్పర్శ స్నేహం. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం. 10లో



వంతెన నిర్మించేదెన్నడో?

మండల పరిధిలోని బోప్పన్‌పల్లి నుంచి ప్యారవరానికి వెళ్లే దారి మధ్యలో ఉన్న వాగుపై వంతెన లేకపోవటంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. 11లో



అర్హులకు దళితబంధు వర్తింపజేయాలి 11లో

అర్హులకు దళితబంధు వర్తింపజేయాలని కాంగ్రెస్ అధ్వర్యంలో శనివారం గుమ్మడిదలలో రాస్తారోకో నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు



రైల్వే స్టేషన్

జహీరాబాద్: రూ. 24 కోట్లతో చేపట్టనున్న రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగనుంది. నేడు అమృత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు జరిగే కార్యక్రమానికి ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్ రావు, రైల్వే శాఖ అధికారులు హాజరు కానున్నారు. దీనికి చెందిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

ఎంపీ బీబీపాటిల్‌కు సత్కారం



ఎంపీని సత్కరిస్తున్న నాయకులు

జహీరాబాద్: ఎంపీ బీబీ పాటిల్‌ను బీఆర్ఎస్ నాయకులు సత్కరించారు. ఆయన చొరవతో అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.24కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. శనివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, బీఆర్ఎస్ నాయకులు యాకూబ్, ఈశ్వర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో బైక్‌పై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పర్యటించారు. శనివారం తూంకుంట, సత్వార్, చిరాగ్‌పల్లి, మధులైతండా, గోవింద్‌పూర్, లచ్చనాయక్ తండాలను పరిశీలించారు. శానిటేషన్, మొక్కల పెంపకం, తాగు నీరు, పరిసరాల పరిశుభ్రతలను గమనించారు. గ్రామాల్లో ఏ మేరకు సమస్యలున్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల రికార్డులు పరిశీలించారు. పనుల నిర్వహణ తీరుపై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ సుమతి, ఎంపీఓ మహేష్, ఆటవీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యం



వెంకటేశం



ప్రవీణ్ కుమార్

పటాన్‌చెరుటౌన్: వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీకి చెందిన బొస వెంకటేశం (60) మతిస్థిమితం సరిగా లేక ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఈనెల 2వ తేదీన ఇంటికి తీసుకొచ్చారు. ఈక్రమంలో శుక్రవారం వాకింగ్‌కు వెళ్తున్నానని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. శనివారం కుమారుడు అభిలాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డ్రైవింగ్‌కు వెళ్తున్నానని..

క్యాబ్ డ్రైవింగ్‌కు వెళ్తున్నానని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భవానిపురం కాలనీకి చెందిన నంబె ప్రవీణ్ కుమార్ (28) క్యాబ్ డ్రైవర్‌గా పని చేసుకునేవాడు. అయితే ఆన్‌లైన్‌లో బెట్టింగ్ గేమ్ ఆడే అలవాటు ఉన్న ప్రవీణ్ కుమార్ అప్పుల పాలయ్యాడు.రుణదాతలు ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో జూలై 28న డ్రైవింగ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి రాలేదు. శనివారం అతడి భార్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోర్లకు ఫ్లోమీటర్లు



బోరుబావుల ద్వారా తోడుకునే నీటికి ఇక నుంచి పన్ను చెల్లించాలి. ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో వ్యవసాయ, ఇంటి అవసరాల వినియోగంపై మినహాయింపునిచ్చింది. టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు పొందిన, లేని పరిశ్రమలు పన్ను కట్టాలని భూగర్భజల శాఖ ఇప్పటికే నోటీసులిచ్చింది.

- తోడుకునే నీటికి పన్ను
- ప్రతి వెయ్యి లీటర్లకు రూపాయి
- అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల బోర్లకు కూడా..
- వ్యవసాయం, ఇంటి అవసరాలకు మినహాయింపు
- పరిశ్రమలకు నోటీసులిస్తున్న భూగర్భజల శాఖ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : బోరుబావుల నీటికి ఇప్పటివరకు ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇక పన్ను చెల్లించాల్సిందే. గ్రౌండ్‌వాటర్ అబ్‌స్ట్రాక్షన్ చార్జీల పేరుతో ప్రతి వెయ్యి లీటర్లకు (ఒక్క కిలో లీటరు)కు ఒక రూపాయి చొప్పున సెస్సు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుత్ స్లాబ్ సిస్టం మాదిరిగా ఎక్కువ మొత్తంలో నీటిని తోడితే ఈ రేటూ పెరగనుంది. భూగర్భజలాలు అడుగంటిన ప్రాంతాల్లోని బోర్ల నుంచి రెట్టింపు రేటు వసూలు చేయనున్నారు. బోర్ల నుంచి ఎంత తోడుతున్నారో లెక్కించేందుకు త్వరలోనే అన్ని బోర్లకు డిజిటల్ ఫ్లోమీటర్లు బిగించుకోవడం తప్పనిసరి కానుంది. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను జిల్లా అధికార యంత్రాంగం అమలు చేస్తోంది.

అపార్టుమెంట్లూ చెల్లించాల్సిందే..

అపార్టుమెంట్లలో ఉన్న బోర్లు, గేటెడ్ కమ్యూనిటీలోని బోర్లు కూడా ఈ సెస్సు చెల్లించాల్సిందేనని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు, మైనింగ్ కార్యకలపాలు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే బోర్లు కూడా సెస్సు వేస్తారు. వ్యవసాయ బోరు బావులు, చిన్న ఇళ్లలో ఉండే బోర్లకు మినహాయింపు ఇచ్చింది.

బోర్లు రెగ్యులరైజ్ తప్పనిసరి

గ్రౌండ్ వాటర్ అబ్‌స్ట్రాక్షన్ చార్జీలకు గాను జీఓ 15 మేరకు ముందుగా అన్ని పరిశ్రమలకు నోటీసులిస్తున్నాం. అనుమతులు లేని బోర్లు రెగ్యులరైజ్ చేసుకోవాలి. ఫ్లోమీటర్లు బిగించుకుని ప్రతి నెలా సెస్సు చెల్లించాలని పేర్కొంటున్నాం.

– వెంకటేశ్వర్లు, భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్

మొదట పరిశ్రమల నుంచే

మొదట పరిశ్రమల నుంచి ప్రారంభించాలని భూగర్భజల శాఖ భావిస్తోంది. ఇప్పటికే టీఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు పొందిన పరిశ్రమలతోపాటు, అనుమతులు లేని వాటికి కూడా నోటీసులు జారీ చేస్తోంది. ఆయా పరిశ్రమల్లో ఎన్ని బోర్లు ఉన్నాయి?, ఎన్నింటికీ అనుమతులు తీసుకున్నారు. అన్ని బోర్లకు ఫ్లోమీటర్లు బిగించుకున్నారా? అనుమతులు లేని బోర్లు ఎన్ని? ఇలా అన్ని వివరాలను సేకరిస్తోంది. ఎంత మొత్తంలో నీటిని తోడుతున్నారో లెక్క గట్టి ఈ సెస్సు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొంది.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ జయదేవ్



మొక్కకు నీరు పోస్తున్న జయదేవ్

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ జయదేవ్ పిలుపునిచ్చారు. మండలంలోని అల్లీనగర్‌లోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం జయదేవ్ మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగంగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాశ్‌చారి, ఎంపీడీఓ రాములు, ఏపీఓ సంతోష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



జహీరాబాద్ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

- విలీన బిల్లు ఆమోదించాలని డిమాండ్



జహీరాబాద్ బస్టాండ్‌కే పరిమితమైన బస్సులు

సంగారెడ్డి టౌన్/జహీరాబాద్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని గవర్నర్ వెంటనే ఆమోదించాలని శనివారం పట్టణ డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు బైఠాయించారు. దీంతో బస్సులను 2 గంటలపాటు వెళ్లకుండా డిపోలోనే నిలిపివేశారు. జహీరాబాద్‌లో.. శనివారం డ్రైవర్లు, కండక్టర్లు డిపో వద్ద 2 గంటలపాటు బస్సులను నిలిపి వేసి బైఠాయించారు. గవర్నర్ తీరుపై వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

భవిత ప్రశ్నార్థకం



విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

- జిల్లాలో 27 కేంద్రాల ఏర్పాటు
- రెండేళ్లుగా నిరుపయోగం
- ఇబ్బందుల్లో 2,280 మంది దివ్యాంగులు

హత్నూర(సంగారెడ్డి): జిల్లాలో భవిత సేవలు నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగులైన మూగ, చెవిటితోపాటు ఇతర శారీరక లోపంతో జన్మించిన చిన్నారుల సంరక్షణకు జిల్లాలో 27 ఫిజియోథెరపీ(భవిత) కేంద్రాలున్నాయి. ఇందులో 2,280 మంది దివ్యాంగులున్నారు. ఇవి రెండేళ్లగా పని చేయడం లేదు. ఇద్దరే ఫిజియోథెరపీలు ఉన్నారు. వీరికి జిల్లాలోని 8 కేంద్రాలు కేటాయించారు. అయినా అవి నామ్‌కే వాస్తేగా ఉన్నాయి. మిగతా 19 భవిత కేంద్రాలకు ఫిజియోథెరపీలు లేరు.

వీటి సంగతేమిటి?

పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ చేసి, బొమ్మలు రంగులను గుర్తించేలా శిక్షణ ఇచ్చేవారు. వారానికోసారి నిపుణుల ఆధ్వర్యంలో థెరపీ చేయించి, ఆసనాలు వేయించేవారు. సెంటర్లో ఆయాతోపాటు కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్ యాక్టివిస్టులకు సైతం ఫిజియోథెరపీలపై శిక్షణ ఇస్తారు. సీఆర్పీలు గ్రామాల్లో పర్యటించి 15 రోజులకోసారి పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తారు. వారి అవసరాలపై అవగాహన కల్పిస్తారు. కాగా ఫిజియోథెరపీ కోసం పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకురావడం మళ్లీ వదిలిపెట్టడానికి ఆటోవాలాకు నెలకు రూ. 20 వేల చొప్పున అద్దె ఇచ్చేవారు. ఇప్పుడు ఆ నిధులు సైతం లేవని తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో ఉన్న భవిత కేంద్రాలు సవ్యంగా సాగేలా చర్యలు తీసుకోవాలని, ఫిజియోథెరపీలను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

జిల్లాలోని భవిత కేంద్రాలకు త్వరలోనే ఫిజియోథెరపిస్టులను నియమిస్తాం. ఇప్పటికే ఇద్దరు ఫిజియోథెరపిస్టులుండగా, మరో 8 మందిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశాం. కరోనా కారణంగా రెండేళ్ల నుంచి భవిత కేంద్రాల సేవలు నిలిచిపోయాయి.

– ఎస్ వెంకటేశం, జిల్లా విద్యాశాఖ అధికారి

అంచనా వ్యయాన్ని పెంచండి

- అందోల్ రోడ్ల దుస్థితిపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే క్రాంతికిరణ్



క్రాంతికిరణ్

వట్‌పల్లి (అందోల్): నియోజకవర్గవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు అంచనా వ్యయాన్ని పెంచాలని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. 'గతంలో రోడ్ల నిర్మాణాలకు టెండర్లను పిలిచారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్ రోడ్లు బాగా దెబ్బతిన్నాయి.రోడ్లను పరిశీలించి అంచన వ్యాయాన్ని పెంచితేనే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గంలోని అల్లాదుర్గం నుంచి మెటల్ కుంట రోడ్డులో సిరూర్ వద్ద పూర్తిగా దెబ్బతింది. నేరడిగుంట సింగూర్‌కు వెళ్లే రోడ్డు, రాయికోడ్ నుంచి కంకోల్ వరకు వెళ్లే రోడ్డు, సంగుపేట నుంచి ముద్దాయిపేట రోడ్డు, చౌటకూర్ నుంచి హత్నూర వైపు వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు కేటాయించినప్పటికీ అంచనా వ్యయం తక్కువతో పనులు జరుగడం లేదు. అంచన వ్యాయాన్ని మార్చాలి' అని అన్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ స్పందిస్తూ, ఎమ్మెల్యేలు రోడ్ల విషయమై ప్రతిపాదనలు పంపారని, అవి సీఎం కేసీఆర్ వద్ద ఉన్నాయని, పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని సమాధామిచ్చారు.

కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): మరో కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాణిక్ రావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సౌకర్యార్థం కొత్త జిల్లాలు, కొత్త మండలాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 39 గ్రామాలతోపాటు తండాలు కూడా ఉన్నందున హద్నూర్ లేదా గంగ్వార్ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగా హద్నూర్‌ను గానీ గంగ్వార్‌ను గానీ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు గతంలో ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. రెండిట్లో ఏదొకటి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అసెంబ్లీలో కోరారు.

గంటల వ్యవధిలో తండ్రీకొడుకుల మృతి

- రోడ్డు ప్రమాదంలో తనయుడు
- అతడి మృతి విషయం తెలిసి తండ్రి గుండెపోటుతో కన్నుమూత
- పుల్కల్ మండలంలో విషాదం



ధర్మానాయక్ భీమ్లానాయక్

పుల్‌కల్(అందోల్): రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతిచెందటాన్ని తట్టుకోలేని తండ్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఒకే ఇంట్లో ఇద్దరి మృతితో ఆ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని గొంగ్లూర్ తండాలో శనివారం జరిగింది. తండాకు చెందిన భీమ్లానాయక్ (55) వ్యవసాయం చేసుకునేవాడు. అతడి బోరు మోటారు చెడిపోవడంతో శుక్రవారం జోగిపేటలో మరమ్మతులు చేసుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయానమవుతున్నాడు. మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతడి మృతదేహాన్ని జోగిపేట ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుమారుడు విగతజీవిగా చూసి తట్టుకోలేక తండ్రి ధర్మానాయక్ (75) గుండెపోటుకు గురయ్యాడు. సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలాడు. గంటల వ్యవధిలోనే తండ్రీకొడుకులు మృతి చెందడంతో గొంగ్లూర్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం వారి అంత్యక్రియలు నిర్వహించారు.

అనాథలకు చేయూత

- 14 కుటుంబాలకు చెందిన 22 మందికి ఆర్థిక సాయం

సాక్షి స్పందన

హత్నూర (సంగారెడ్డి): ఈనెల 1న దేవుడా ...దిక్కెవరు? అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్ స్పందించారు. హత్నూర మండలంలోని 14 కుటుంబాలకు చెందిన 22 మందికి ఒక్కో కుటుంబానికి రూ.10 వేలచొప్పున శనివారం ఆర్థిక సాయాన్ని అందించారు. కోడిపాకకు చెందిన గోల్కొండ స్నేహ, గోపీచంద్, జస్వంత్, తెల్లరాళ్ల తండాకు చెందిన శిరీష, సుధాకర్, సిరిపురానికి చెందిన శివ, చాకలి యాదమ్మ, చాకలి శ్రీకాంత్, కాసాలకు చెందిన అంకిత, సికింద్రాపూర్‌కు చెందిన కావేరి, దీక్షితులు, మీనాక్షి, సుప్రియ, సాధువులనగర్‌కు చెందిన అనిల్, ఐశ్వర్య, నీరుడి భానులు, కొన్యాలకు చెందిన ముగ్గురు చిన్నారులు, ఇదే గ్రామంలో తల్లిదండ్రులు ఇద్దరు లేవలేని స్థితిలో ఉన్న కొంత కిష్టయ్య, సుశీలకు చెందిన ఇద్దరు చిన్నారులకు ఆర్థిక సాయం చేశారు. సాక్షిని పలు గ్రామాల ప్రజలు నాయకులు అభినందించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



కిట్లను అందజేస్తున్న రోజాశర్మ

గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మాతాశిశు ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌తో కలిసి గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ బిల్లులు చెల్లించాలి

కొండాపూర్(సంగారెడ్డి): పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్(జనరల్ ప్రావిడెంట్ ఫండ్) బిల్లులు చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా పరిషత్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ గైడ్ మాట్లాడుతూ, జిల్లా పరిషత్ కార్యాలయంలో జీపీఎఫ్ విభాగంలో గత 14 నెలలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెందిన సుమారు రూ.45 కోట్ల బిల్లులు మంజూరైనా గానీ సంబంధిత వ్యక్తిగత ఖాతాల్లో జమ కాకుండా ఈ-కుబేరులో పెండింగులో ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ 2,741 కోట్ల బిల్లులు ఈ-కుబేరులో ఎదురు చూస్తున్నాయన్నారు. వెంటనే వీటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రామ్‌చందర్, సీనియర్ నాయకులు రాంచందర్ భీంవంశీ, రాష్ట్ర కౌన్సిలర్లు రాజీ రెడ్డి, లక్ష్మయ్య యాదవ్, సంజీవయ్య, సోమశేఖర్, జీవన్ రావు, సుభాష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బిచ్చయ్య, విజయ్ భాస్కర్ , పాండురంగారెడ్డి పాల్గొన్నారు.



జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

స్నేహం ఎంతో మధురమైనది. కష్టకాలంలో నేనున్నానంటూ భుజం తట్టే ఆత్మీయ స్పర్శ స్నేహం. అమ్మానాన్నల తర్వాత దేవుడిచ్చిన గొప్ప బహుమతి. బంధుత్వాల కన్నా బలమైన బంధం.. ప్రపంచం నీకు దూరమైనప్పుడు దగ్గరయ్యే వాడే నిజమైన స్నేహితుడు. మంచి స్నేహం ఆదర్శమైన జీవితాన్ని ఇస్తుంది. మానవ సంబంధాలు ఆర్థిక బంధాలుగా మారిపోయి మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణంలో ఆత్మీయ స్నేహాలు వెలుగు రేఖలుగా దారి చూపుతూనే ఉంటాయి. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..





నేడు స్నేహితుల దినోత్సవం

కొత్త ఉద్యోగం.. కొత్త స్నేహితులు



సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట ఐటీ టవర్ వివిధ ప్రాంతాలకు చెందిన వారిని ఒక చెట్టు కిందికి తీసుకువచ్చింది. ఇందులో సుమారు 12 సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇప్పటికే ఉద్యోగుల ఎంపిక పూర్తి చేసి శిక్షణ ఇస్తోంది. పలువురు ఐటీ ఉద్యోగులను భోజన విరామ సమయంలో కొత్త ఉద్యోగం.. కొత్త స్నేహితులు అనే అంశంపై 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలను పంచుకున్నారు.

ఎవరికీ ఎవరం తెలియదు

ఉద్యోగంలో జాయిన్ అయినప్పుడు ఎవరి ఎవరం తెలియదు. జాయిన్ అయిన రోజు సార్ వాళ్లు పరిచయం చేయించారు. ఈనెల రోజుల్లోనే మా కంపెనీల ఎంప్లాయీస్ అందరం క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యాం. తొలుత కొంచెం భయం ఉండేది.. ఇప్పుడు అందరం ఒక ఫ్యామిలీ లాగా ఉంటున్నాం. – వైష్ణవి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

హ్యాపీగా ఉంది



నేను మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను. వెంటనే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మా కంపెనీలో తక్కువ మంది ఉండడంతో చాలా క్లోజ్ అయ్యారు. నేను రూంలో ఉంటున్నా వారే నన్ను ప్రతి రోజు పికప్ డ్రాప్ చేస్తున్నారు. నాకు ఐటీ టవర్‌లో చాలా మంది కొత్త ఫ్రెండ్స్ అయ్యారు. వారితో చాలా హ్యాపీగా ఉంటూ ట్రైనింగ్ తీసుకుంటున్నా. – వంశీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

మొక్కలు నాటుతాం



మా ఇద్దరిది ఒకే స్కూల్. వేరు వేరు కళాశాలల్లో చదివాం. ఐటీ టవర్ వల్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఒకే కంపెనీలో పని చేస్తున్నాం. అలాగే మా కంపెనీలో పనిచేస్తున్న అందరిని పరిచయం చేసుకుని కొత్త దోస్తులం అయ్యాం. ఒకరికొకరం హెల్ప్ చేసుకుంటున్నాం. సిద్దిపేట అంటే హరిత సిద్దిపేట. అందుకే మా స్నేహితులందరం కలిసి మొక్కలు నాటేందుకు కృషి చేస్తాం. – స్వాతి, గీత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



మాది 23 ఏళ్ల దోస్తాన..

మాది సిద్దిపేటలోని గోసెవల్లి గ్రామం. ముగ్గురం ఒకే స్కూల్, ఒకే కాలేజీ. మా ఇద్దరికీ ఒకే కంపెనీలో జాబ్ వచ్చింది. ఇంకో ఫ్రెండ్ రాహుల్‌కు రాలేదు. వాడికి కూడా మా కంపెనీలో జాబ్ రావాలని కోరుకుంటున్నాం. మాది 23 ఏళ్ల దోస్తాన్. ఐటీ టవర్‌లో కొత్త దోస్తులం చాలా మంది అయ్యాం. – అరవింద్, నిఖిల్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

నా అప్లికేషన్ నింపింది నర్సింహులే..



మెదక్: కుటుంబ సభ్యులతో పంచుకోలేని ఎన్నో సంఘటనలు స్నేహితుడితో పంచుకుంటామని మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ అభిప్రాయపడ్డారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయనను పలకరించగా.. తన అనుభవాలను పంచుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామం మా సొంత ఊరు. విద్యాభ్యాసం గద్వాలలో జరిగింది. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ కళాశాల కాగా, డిగ్రీ ఓయూలో పూర్తి చేశాను. బాల్య మిత్రుడు నర్సింహులు 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు తన క్లాస్‌మేట్. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లలో నర్సింహులుతో కలిసి పాల్గొన్నా. డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగం కోసం దరఖాస్తు చేసే సమయంలో నా అప్లికేషన్ కూడా అతడే నింపా డు. నర్సింహులుకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేయాలని ఆసక్తి ఉండేది. కాని రెండుసార్లు ప్రయత్నం చేసినప్పటికీ ఉద్యోగం సాధించలేక పోయాడు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. 1989లో నేను ఎస్‌ఐగా సెలక్షన్ అయ్యాను. ఇప్పటివరకు కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో సర్వీస్ కొనసాగింది. ప్రస్తుతం మెదక్ జిల్లాకు అదనపు (అడ్మిన్) ఎస్పీగా వచ్చాను. ఇప్పటివరకు తన సర్వీస్‌లో 100 అవార్డులు వచ్చాయి. అలాగే ప్రస్తుతం మెదక్ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు నాతో ఓయూలో చదివాడు.. ఆయన కూడా నాకు మంచి మిత్రుడు. నేను మెదక్‌కు వచ్చాక.. ఏరా మిత్రమా! ఎలా ఉన్నావని పలకరించి గత స్మృతులను పంచుకున్నాం.

మిత్ర బృందం.. ఆపన్నహస్తం



గజ్వేల్‌రూరల్: ఒకే ఊరివారు కాదు.. ఒకే చోట చదువుకోలేదు. జీవనోపాధిలో భాగంగా ఒకే ప్రాంతంలో వివిధ రంగాల్లో కొనసాగుతున్నారు. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌కు చెందిన పాశికంటి బాల్‌చంద్రం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద వాచ్ రిపేరింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అక్కారం గ్రామానికి చెందిన కటుకం శ్రీనివాస్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఇదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. వీరితో పాటు గుండన్నపల్లికి చెందిన కొల్లూరి శ్రీనివాస్, గజ్వేల్‌కు చెందిన ఎగ్గిడి రాజు, కొలిచెలిమె స్వామి (కూరగాయల వ్యాపారం) చేస్తున్నారు. వేర్వేరు వృత్తుల్లో ఉన్న ఈ ఐదుగురు 2009 నుంచి నిత్యం పేపర్లలో వచ్చే కథనాలను చదువుతూ చలించిపోయేవారు. వీరితో పాటు మరో 10 మంది కలిసి «ఆపన్నహస్త మిత్ర బృందం»గా ఏర్పడ్డారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారు. వీరి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు వివిధ రంగాలకు చెందిన సుమారు 150 మంది వరకు సభ్యులుగా చేరారు. వీరంతా ప్రతి నెల 5వ తేదీలోగా ఓ సమావేశం ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమం కోసం ఒక్కో సభ్యుడు రూ. 200 జమచేస్తారు. ప్రతి నెల ఒక కార్యక్రమం చొప్పున ఇప్పటివరకు 80 సేవా కార్యక్రమాలు చేపడుతూ.. మనసున్న మారాజులుగా నిలుస్తున్నారు.



బాసటగా 'బడి సోపతులు'

హుస్నాబాద్: పట్టణంలో 1983- 84 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు «బడి సోపతులు» పేరిట స్నేహితుల కుటుంబాల కష్ట నష్టాల్లో పాలు పంచుకుంటున్నారు. అలాగే పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుత పెద్దపల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్‌లాల్, కొత్తపల్లి అశోక్ సారథ్యంలో వీరి స్నేహం దృఢంగా కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం గెట్ టు గెదర్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తూ స్నేహితుల యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ స్నేహ హస్తం అందిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారానే అవసరమైన నిధిని సేకరిస్తూ స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

స్నేహం.. కష్టాల్లో కలకాలం




వర్గల్(గజ్వేల్): సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం వారందరూ వర్గల్ జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ క్లాస్ విద్యార్థులు. అప్పట్లో 101 మంది విద్యార్థులతో వారిది జంబో బ్యాచ్. ప్రస్తుతం వారందరూ వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వర్గల్ ఉపసర్పంచ్ పసుల రమేష్, శాకారం ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్ తదితర 55 మంది విద్యార్థులు సమూహంగా «క్లాస్‌మెట్స్ 2003-04» అని వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. తమ బ్యాచ్‌లో ఎవరికి కష్టం వచ్చినా అండగా ఉంటున్నారు. అయిదు సంవత్సరాల క్రితం తమ బ్యాచ్‌మేట్ శాగంటి దుర్గాప్రసాద్ ప్రమాదానికి గురై మృ చెందగా అతని కుటుంబానికి రూ. 26 వేల ఆర్థికసాయం చేశారు. కొద్ది నెలల క్రితం బ్రహ్మచారి మృతిచెందగా భార్య, ముగ్గురు పిల్లలతో కూడిన అతని కుటుంబం కష్టాల్లో కూరుకుపో యింది. వెంటనే స్పందించి వారి కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అ ంద జేశారు.

నీకేం కాదు.. మేమున్నాం

మునిపల్లి(అందోల్): స్నేహితులతో కలిసి ఆదివారం ఇంటిపైన ఆడుకుంటుండగా 2019లో విద్యుత్ తీగలు తాకి మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన మధుకుమార్ రెండు చేతులు కోల్పోయాడు. ఐదో తరగతి స్నేహితులు అందరూ కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధుకు మార్‌ను కలి శారు. నీకు ఏం కాదు మేము నీకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మధుకుమార్‌ను ఆదుకున్నాయి. రెండు చేతులు కోల్పోయిన మధుకుమార్ నోటితో బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. అతడి ప్రతిభ చూసిన కలె క్టర్ వెం కటేశం మధు కుమా ర్‌ను అభినందించారు.



ఏ కష్టమొచ్చినా ముందుంటాం



ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు. స్నేహితులకు ఏ కష్టమొచ్చిన మేమున్నామని బడి సోపతుల పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులుగా ఆదుకుంటున్నాం. పూర్వ విద్యార్థి.. ప్రస్తుత పెద్దపెల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్‌లాల్ సారథ్యంలో 2013 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్నేహితుల ఆడపిల్లల పెళ్లిళ్లకు సాధ్యమైనంత వరకు ఆర్థిక సాయం చేస్తున్నాం. – కొత్తపల్లి అశోక్, బడి సోపతుల నిర్వాహకుడు

రక్తసిక్తమైన రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

కుక్కను తప్పించబోయి..



వడ్ల రాజు (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): కుక్క అడ్డురావడంతో తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న సైడ్ రేలింగ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆరుగొండ గ్రామానికి చెందిన వడ్ల రాజు (32) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతడి చెల్లెలి వద్దకు బావమరిది రామస్వామితో కలిసి బొంతపల్లికి వచ్చాడు. రాత్రి అక్కడే ఉండి, శనివారం ఉదయం కెట్టిపల్లి సంగారెడ్డికి చెందిన రామస్వామి, తమ్ముడు సతీష్‌తో కలిసి వీరభద్ర స్వామి ఆలయంలో దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం రాజు, సతీష్ ఇద్దరు కలిసి అక్కడి నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. కౌడిపల్లి బట్టమ్మదేవి ఆలయం వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సైడ్ రేలింగ్‌కు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి 108 అందుబాటులో లేకపోవడంతో ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజు మృతి చెందినట్టు నిర్ధారించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడి చెల్లెలు మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. రాజు తండ్రి అనారోగ్యంతో మంచానికే పరిమితం కాగా భార్య నిండు గర్భిణి.

మాసాయిపేట శివారులో..



ప్రభాకర్ (ఫైల్)

వేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారులో జరిగింది. ఎస్‌ఐ హరీష్ కథనం ప్రకారం.. మండలంలోని చెట్లతిమ్మాయిపల్లికి చెందిన చిన్నోళ్ల ప్రభాకర్ (40) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున తూప్రాన్ వైపు నుంచి డానియల్‌తో కలిసి ఆటోలో గ్రామానికి వస్తుండగా.. చౌరస్తా వద్ద నిజామాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. ప్రభాకర్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా.. డానియల్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డానియల్‌ను మెరుగైన వైద్యంకోసం గాంధీ ఆస్పత్రికి పంపినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..



ఐలయ్య (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): పొలానికి వెళ్లడానికి జాతీయ రహదారి దాటుతున్న రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు జరిగింది. మండల కేంద్రానికి చెందిన రైతు కేశబోయిన ఐలయ్య (55) తన పొలం వద్దకు వెళుతున్న క్రమంలో 44వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో నిజామాబాద్ వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య అమృత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కొండాపూర్(సంగారెడ్డి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కొండాపూర్ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన ఇంద్రకుమార్(24) సంగారెడ్డి మండలం సదాశివనగర్‌కు చెందిన కొత్తగడి ప్రవీణ్ ఇద్దరూ స్నేహితులు. వీరు రాత్రి జహీరాబాద్ నుంచి సంగారెడ్డికి వెళ్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఇంద్ర కుమార్‌కు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి



సత్యస్వరూప్(ఫైల్)

పటాన్‌చెరుటౌన్: ప్రమాదవశాత్తు ఇంట్లో జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరుకు చెందిన సత్యస్వరూప్ (33) ఏడేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం అమీన్‌పూర్ పరిధిలోని జనప్రియ వ్యాలీలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. డాక్యుమెంటరీ ఫిలిం మేకర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తండ్రి పాకాల శ్రీకాంత్‌తో చివరిగా జూలై 31 తేదీన ఫోన్‌లో మాట్లాడాడు. తిరిగి కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తండ్రి తన కుమారుడి స్నేహితుడైన సాయిరెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో శుక్రవారం ఇంటికి వెళ్లి చూడగా లోపల గడియపెట్టి ఉంది. తలుపులు ఎంత కొట్టిన తీయకపోవడంతో పాటు ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికుల సహకారంతో కిటికీ పగలగొట్టి చూశాడు. సత్యస్వరూప్ నేలపై పడి మృతిచెంది కుళ్లిన స్థితిలో కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు.. మనస్తాపంతో మరొకరు..



సందీప్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లిలో ఆర్ఎంపీగా పనిచేస్తున్న బోతం సందీప్ (49) ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ జగదీశ్వర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సందీప్ ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. దీంతో తీర్చేమార్గం లేక శుక్రవారం సాయంత్రం పురుగు మందు తాగి ఇంటికొచ్చి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అయినాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుడిక్యాల నర్సింహులు(71) పొన్నాలలోని ఓ దాబాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, పిల్లలు లేకపోవడంతో గ్రామంలో ఉన్న ఇంటిని అదే గ్రామానికి చెందిన పాన్నోజు మంజులకు అద్దెకు ఇచ్చాడు. ఇదే అదునుగా భావించిన మంజుల అతడికి రూ. 2 లక్షలు అప్పు ఇచ్చినట్టు కాగితాన్ని సృష్టించి కొంతమంది చేత సాక్షి సంతకాలు పెట్టించి మానసిక ఇబ్బందులకు గురిచేసింది. నర్సింహులుకు ఎవరూ లేకపోవడంతో తన ఇంటిని స్వాధీనం చేసుకోవాలని కుట్ర పన్నింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు కావడంతో నర్సింహులు ఇల్లు ఖాళీ చేయాలని మంజులకు సూచించాడు. మనసులో పెట్టుకున్న మంజుల గ్రామానికి చెందిన పుల్లూరి భవిత్ కుమార్, తేజకిషోర్, కాయిత రాజేందర్‌రెడ్డి, భట్టు యాదగిరి, దండు నర్సింహులు, మచ్చెర్ల ముత్యంరెడ్డి, మల్లం యాదయ్యతో కలిసి నర్సింహులు పనిచేస్తున్న చోటుకు వెళ్లి బెదిరించి కాగితం రాయించుకున్నట్లు సమీప బంధువులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నర్సింహులు శనివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతిపై స్థానికులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కూలి పనులకు వెళ్లి.. విగతజీవిగా మారి

● అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పొలం గట్టుపై యాదగిరి మృతదేహం

తొగుట(దుబ్బాక): కూలికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దమాసాన్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాశ యాదగిరి (38) నిరుపేద కుటుంబం. వారికి కూతురు నందిని(14), కుమారుడు (7) ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో యాదగిరి రోజూ మాదిరిగానే గ్రామానికి చెందిన తాళ్ల పెంటయ్య, అంజయ్యతో కలిసి అదే గ్రామానికి చెందిన దాసరి దుర్గయ్య వ్యవసాయ పొలంలో పనికి వెళ్లాడు. పొలంలోకి వెళ్లిన ముగ్గురు పనుల్లో నిమగ్నం కాగా.. కొంత సమయం తర్వాత యాదగిరి అకస్మాత్తుగా పొలంలో పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు బయటకు తీసుకువచ్చి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడకు వచ్చి పరిశీలించగా యాదగిరి అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు తొగుట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.